క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



శ్రీవారిని దర్శించుకుని బయటికి వస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం వాసుపల్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వామిని ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరన్నారు. ఏడు కొండల స్వామి చల్లని చూపు, ఆశీస్సులు ఆంధ్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

రూ. 10 భోజనానికి 371 రోజులు



రోగులకు భోజనాలు పంపిణీ చేస్తున్న వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో గత 371 రోజులుగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, వారి సహాయకులకు రూ. 10కే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల చైర్మన్ మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ తమ రౌండ్ టేబుల్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, సంస్థ సభ్యుల సహకారంతో గోషా ఆస్పత్రిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భోజనం తయారు చేయడానికి రూ. 50 ఖర్చవుతుందన్నారు. అయితే లాభాపేక్ష లేకుండా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛను పంపిణీ చేస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట : దక్షిణ నియోజకవర్గం పరిధి 29వ వార్డు రంగిరీజు వీధిలో సామాజిక పింఛన్లను ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ గురువారం పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అక్కడి నుంచి పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఆనందమార్గ ఆశ్రమానికి వితరణ



పిల్లలకు అందించిన నిత్యావసర సరకులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఉన్న అనాథ పిల్లల కోసం పాత డెయిరీ ఫారం వద్ద రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్ నిర్వాహకులు గురువారం నిత్యావసర సరకులు అందజేశారు. సుమారు రూ.15 వేలు విలువ చేసే 50 కిలోల బియ్యం, పప్పులు, ఆయిల్ ప్యాకెట్లు, సబ్బులు, పంచదార, గోధుమ పిండి తదితర సరకులు ఇక్కడ ఆశ్రమం కమిటీ నిర్వాహకులు, పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవదూత, కమిటీ సభ్యుడు పాత్రో దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

జనతా బేజార్

జనతాబజార్.. 72 దుకాణాల సముదాయం ఇది. వ్యాపారుల సౌలభ్యార్థం ఇక్కడ 1972లో జీవీఎంసీ షాపులు నిర్మించింది. అయితే అవి నేడు శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉండటంతో వ్యాపారులను ఖాళీ చేయమని ఆదేశాలు జారీ చేసినా ఎవరూ ఖాళీ చేయడం లేదు. అలాగే అక్కడి స్క్రాప్ వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేయరాదని కమిషనర్ ఆదేశించినా వ్యాపారులు బేఖాతర్ చేస్తున్నారు.

- పూర్తిగా శిథిలమై.. కూలేందుకు సిద్ధంగా ఉన్న దుకాణ సముదాయం
- రోడ్డంతా స్క్రాప్ పరిచేసి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులు
- జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్



దుకాణాలు వదిలి రోడ్డుపైకి వచ్చిన స్క్రాప్



రోడ్డుకు రెండవ వైపు కూడా అదే స్క్రాపే వాహనాలు

జగదాంబ : జీవీఎంసీ జోన్-4 పరిధి 35వ వార్డులో ఉన్న జనతాబజార్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లున్న ఈ దుకాణ సముదాయాన్ని మూడు రోజుల కిందట జీవీఎంసీ నూతన కమిషనర్ పి. సంపత్‌కుమార్ పరిశీలించారు. ఇక్కడి వ్యాపారులు రహదారిని ఆక్రమించుకుని చేస్తున్న స్క్రాప్ వ్యాపారాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లను బ్లాక్ చేస్తూ ఇష్టానుసారంగా రోడ్డంతా స్క్రాప్ పరిచేస్తే వాహనాల రాకపోకలు ఎలా సాగుతాయి? పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. వెంటనే మొత్తం స్క్రాప్‌ను తొలగించాలని వ్యాపారులను ఆదేశించారు. అయితే నేటికీ కమిషనర్ ఆదేశాలు అమలు కాలేదు. ఇక్కడి వ్యాపారులు ఎవరూ అంగుళం కూడా స్క్రాప్‌ను తొలగించలేదు.

అద్దెల మాటే లేదు..

జీవీఎంసీ జనతా బజార్ అనేది 72 దుకాణాల సముదాయం. ఇక్కడ వ్యాపారం చేసుకునే వారంతా గతంలో వివిధ కారణాల వల్ల కోర్టును ఆశ్రయించి కోర్టులోనే అద్దెలు చెల్లించేవారు. తర్వాత ఈ దుకాణాలు శిథిలం కావడంతో మందస్తు రక్షణలో భాగంగా వాటిని కూల్చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే అలా జరగలేదు కానీ.. దీన్నొక సాకుగా తీసుకున్న వ్యాపారులు అప్పటి నుంచి జీవీఎంసీకి అద్దెలు చెల్లించడం మానేశారు. కొందరు వ్యాపారులైతే జీవీఎంసీ దుకాణాలను తమకు అనుకూలంగా రీఫిటింగ్ చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.

కూలేందుకు సిద్ధంగా...

జనతాబజార్ దుకాణాల సముదాయాన్ని 1972లో నిర్మించారు. 50 ఏళ్లు పైబడటంతో ఇది పూర్తిగా శిథిలం అయింది. దీంతో పాటు దుకాణ సముదాయం వెనుక మురుగును సముద్రంలో కలిపే కెనాల్ ఉండటంతో ఆ చెమ్మకు జనతా బజార్‌లోని చాలా చోట్ల శిథిలమయింది. అలాగే గోడల పెచ్చులూడిపోయాయి. పిల్లర్లదీ అదే పరిస్థితి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఈ దుకాణ సముదాయం మరింత అధ్వాన స్థితికి చేరుకుంది.

ముందుకు కదలని కోర్టు ఆర్డర్..

జనతాబజార్‌ను కూల్చేయాలని రెండేళ్ల కిందటే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎన్నికల కారణంగా ఆ పనులు ముందుకు సాగలేదు. అటు తర్వాత దుకాణాల కూల్చివేతకు సంబంధించి నివేదిక తయారు చేయాలని గత జీవీఎంసీ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రూ. 18 లక్షల అంచనాతో వారు కమిషనర్‌కు నివేదిక అందజేశారు. ఈలోగా కమిషనర్ బదిలీ అయిపోవడంతో ఆ ఫైల్ ముందుకు కదల్లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ స్పందించి వెంటనే జనతాజజార్‌ను కూల్చేయకపోతే ప్రమాదమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



శిథిలమైన జనతాబజార్ దుకాణాలు



జనతాబజార్ దుకాణ సముదాయం

కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం..



జనతాబజార్ దుకాణాల డిస్మెటల్ అంశం జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం. కమిషనర్ ఆదేశాల మేరకు ముందుగా రోడ్డుపై స్క్రాప్‌ను తొలగింపజేయిస్తాం. దుకాణాల్లో అద్దెలు లేకుండా ఉన్న వారిని ఖాళీ చేయించడంతో పాటు ఎప్పటి నుంచి ఉంటున్నారో తెలుసుకుని మొత్తం అద్దెను జీవీఎంసీకి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– డీవీవీ ప్రసాదరావు, జోన్-4 కమిషనర్

జోన్-5లో పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో గురువారం సుమారు 97.11 శాతం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోన్ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి మొత్తం 27,273 మంది పింఛన్‌దారులు ఉండగా.. తొలిరోజు 26,589 మందికి పెన్షన్లు అందజేశామన్నారు. రూ 11.84 కోట్ల నగదుకు గాను రూ.10.85 కోట్లను లబ్ధిదారులకు అందించామని చెప్పారు. శుక్రవారం నాటికి 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, సచివాలయ సిబ్బందికి జెడ్సీ కృష్ణ ఆదేశించారు. టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పింఛన్ సొమ్ము అందజేశారు.

పింఛన్లు అందజేసిన జీవీఎంసీ కమిషనర్

జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయ పరిధిలో చేపట్టిన పింఛన్ల పంపిణీని అధికారులతో కలిసి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పర్యవేక్షించారు. పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వద్దని అధికారులు, సిబ్బందికి సూచించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కమిషనర్ చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. ఏపీడీవోలు పద్మావతి, చిరంజీవి, జోనల్ అధికారులు పాల్గొన్నారు.



జోన్-5 కార్యాలయ సమీపంలో పింఛన్ అందిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఎర్రిగెడ్డపై రక్షణ చర్యలు చేపట్టాలి



ఎర్రిగెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్రిగెడ్డపై యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. 41వ వార్డు జ్ఞానాపురంలో గురువారం జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణతో కలిసి ఆయన ఎర్రిగెడ్డను పరిశీలించారు. కాలువలో పూడికలు తొలగించి మురుగు సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. జ్ఞానాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షపు నీరు చేరుతున్నందున శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాలరావును ఆదేశించారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను అదేశించారు. కార్యక్రమంలో జోన్-5 ఈఈలు మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి (ఆర్‌వో) బాబూరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, ఏసీపీ వెంకటరావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలే శ్రేష్టం



దుర్గమాంబ సమాజంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్



కేజీహెచ్‌లో జ్యోతి వెలిగించి తల్లిపాల వారోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ శివానంద్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

జగదాంబ : అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవజాత శిశువులకు తల్లిపాలు నూరుశాతం పోషక విలువలు అందిస్తాయని అవగాహన కల్పించారు. ప్రసాద్‌గార్డెన్స్ అంగన్‌వాడీ కేంద్రంలో ఈ వేడుకలు ప్రారంభం అయ్యాయి.

జీవీఎంసీ 35వ వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డులోని అర్బన్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోకి వచ్చే కల్లుపాకలు-2 , పండావీధి-1, ప్రసాద్‌గార్డెన్స్-2, వెంలపేట-1, మేదరవీధి-1, పువ్వులవీధి-1 తదితర ప్రాంతాల్లో తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులు, బాలింతలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ముర్రుపాల వల్ల తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. తల్లి పాల వల్ల పిల్లలకు ఎటువంటి వ్యాధులు దరి చేరవని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుందని తెలిపారు.

మహారాణిపేట : కేజీహెచ్ పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ హాజరై మాట్లాడారు. త్వరలోనే కేజీహెచ్‌లో తల్లిపాల కేంద్రం ప్రారంభం కానుందన్నారు. అలాగే తల్లులకు తల్లిపాల గదులు కూడా ఏర్పాటవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కృష్ణవేణి, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ సామిని, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి తదితరులు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు.

తల్లిపాల శ్రేష్టతపై అవగాహన ర్యాలీ

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెంలోని వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి పాలు పట్టించాలన్నారు. తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమన్నారు. వారోత్సవాలు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కె.ధర్మేంద్ర, ఐ.మనోరమ, రవిశంకర్, బేగం, నాగభూషణం, హెల్త్ ఎడ్యుకేటర్, నర్సింగ్ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి శుక్లాలపై అశ్రద్ధ తగదు

ఆరిలోవ: కంటిపై ఏర్పడే శుక్లాలను అశ్రద్ధ చేయకూడదని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శిల్పా తరణి తెలిపారు. హనుమంతవాక వద్ద ఎల్‌వీపీ కంటి ఆస్పత్రిలో గురువారం కంటి వ్యాధితో బాధపడుతున్న వారికి ఆమె అవగాహన కల్పించారు. కంటి శుక్లాలను అశ్రద్ధ చేయడం వల్ల అంధత్వం వస్తుందన్నారు. జన్యుపరమైన, జీవక్రియ లోపాలు, ఇన్‌ఫెక్షన్, గాయం వల్ల కంటి శుక్లాలకు గురవుతుంటారన్నారు. కంటిలో తెల్ల మచ్చ కనిపించడం, మెల్ల కన్ను, కనుబొమ్మలు వణకడం వంటివి కంటి శుక్లాల లక్షణాలని తెలిపారు. కంటి శుక్లాలు ఉన్నవారు శస్త్ర చికిత్స చేసుకోవడం మంచిదన్నారు.

ఔషధ మొక్కల పెంపకం ఆరోగ్యానికి మేలు

మద్దిలపాలెం: ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో జీవన వైవిధ్య వనం పెంచుదామని, ఇందుకు విద్యార్థుల సహాయ, సహకారాలు ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం సామాజిక వనాలు పెంచాలన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ విత్తనాల నిధిని ఏర్పాటు చేయడానికి గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. మొక్కలు పెంచడం ద్వారా పక్షులు గూళ్లు పెట్టుకుని వాటి మనుగడ సాధిస్తాయన్నారు. ఆకు కూరల పెంపకాన్ని ఇంటి పెరట్లో చేపడడం ద్వారా తాజా ఆర్గానిక్ ఆకుకూరలు తినేందుకు వీలు కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో వనమాలి సంస్థ ప్రతినిధులు మళ్ల సరిత, ఎ.అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు చంద్రమౌళి, పి.స్వామినాయుడు, వి.పద్మజ, పుష్పలత, సుజాత, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జె.వి.రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నియోజకవర్గ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు

కంచరపాలెం : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజల పక్షాన పోరాడుతామని, పార్టీ ఫిరాయింపులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని ఈ సందర్భంగా పూర్ణిమ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

జగన్‌ను కలిసిన నియోజకవర్గ నాయకులు

మహారాణిపేట : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం దక్షిణ నియోజకవర్గ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మత్స్యకార నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు, కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తదితరులు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మూగి శ్రీనివాసరావు జగన్‌కు షిప్‌ను బహూకరించారు.



జగన్‌కు నౌక నమూనాను బహూకరిస్తున్న డాక్టర్ మూగి శ్రీనివాసరావు

దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో శతాబ్దం నుంచి నిర్వహిస్తున్న దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియమాత ఏ విధంగా లోకానికి తల్లిగా మారిందో విశదీకరించారు. ముందుగా శిలువ గుర్తు వీధిలో దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం సెబాస్టియన్ కాలనీ, బిషప్ మరియదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల, నికోలస్, దయాస్, రాసా వీధుల్లో తేరును ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు వినయ్‌కుమార్, ఆంథోనీ రాజ్, ఆంధ్రా క్యాథలిక్ యూనియన్ ప్రెసిడెంట్ బూర శేషుబాబు, పీపీసీ సభ్యులు పి.ఫ్రాన్సిస్, జి.ఆనందరావు, నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- రెండు రోజుల నుంచి ఉక్కపోతతో ప్రజలు సతమతం



నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ ప్రదాన రహదారి ఇలా బోసిపోయింది



వ్యాపారులు, వినియోగదారులు లేని రామకృష్ణా రైతు మార్కెట్

జగదాంబ : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల తర్వాత రెండు మూడు రోజులుగా భానుడు మళ్లీ నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో బయటికి వెళ్లాలంటే ప్రజలు భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వేసవిని తలపించేలా ఇటీవల ఎండలు విరగకాస్తున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. గాలులు కూడా వేడిగా వీస్తూ మే మాసం ఎండలను గుర్తుకు తెస్తున్నాయి. గురువారం కాసిన ఎండకి రామకృష్ణా రైతుబజార్, పూర్ణామార్కెట్‌లోని చిరు వ్యాపారులు గిరాకీ లేక నష్టపోవాల్సి వచ్చింది. ఎండకి రోడ్లు నిర్మానుష్యమయ్యాయి.

సమస్యలే తిలక్ సాహిత్య ఇతివృత్తాలు

బీచ్ రోడ్డు: సామాజిక సమస్యలపై దేవరకొండ బాలగంగాధర్ తిలక్ తన సాహిత్యంలో ప్రస్తావించారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో దేవరకొండ బాలగంగాధర్ తిలక్ 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జె.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా తిలక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా నరసింహారావు మాట్లాడుతూ తిలక్ సమాజ మార్పు కోసం పేదరికం, భూస్వామ్యం, నియంతృత్వ పోకడలు ఇలాంటి సమస్యలను తన సాహిత్యంలో ప్రస్తావించారన్నారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా డి.ప్రవీణ మాట్లాడుతూ తిలక్‌కు చిన్ననాటి నుంచి సాహిత్య అభిలాష ఎక్కువని, తన కథలు, కవిత్వంలో ప్రతీ అంశాన్ని తిలక్ స్పృశించారని కొనియాడారు. ఆత్మీయ అతిథి జి.యోహానుబాబు మాట్లాడుతూ తిలక్ కవిత్వంలో తన సైనికుడు ఉత్తరం చాలా ఇష్టమని అప్పటి సైనికుల జీవితాన్ని అది ప్రతిబింబించిందని వివరించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకురాలు నేమాని శారదా మాట్లాడుతూ తిలక్ రచనా విలువలు గుర్తుంచుకోవడం చాలా అవసరమన్నారు. బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ తిలక్ కథలో తాత్వికతను ఆవిష్కరించారన్నారు. తెలుగు విభాగం సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ప్రతికవి విమర్శకుడే, ప్రతి విమర్శకుడు కవి కావచ్చు, కాకపోవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్ డాక్టర్ సీతారత్నం డాక్టర్ గిరీష్ కుమార్, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.



తిలక్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తెలుగు శాఖాధిపతి ఆచార్య అప్పారావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు